క్లుప్తంగా

ధీరవనిత కెప్టెన్ లక్ష్మీ సెహగల్



లక్ష్మీ సెహగల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఏలూరు (టూటౌన్): స్వాతంత్ర్య సమరం లోనూ తర్వాత కూడా వీరోచిత పోరాటం చేసిన ధీరవనిత కెప్టెన్ లక్ష్మీసెహగల్ అని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అన్నారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లోని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో కెప్టెన్ లక్ష్మీసెహగల్ 12వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీసెహగల్ చిత్రపటానికి హిమబిందు పూలమాల వేశారు. కార్యక్రమంలో ఎం.సిద్ధార్థ సాయి, కె.జనని, వెంకటరత్నం, విజయ్ కుమార్, రాజ్ కుమార్, పుష్ప, సంజన తదితరులు పాల్గొన్నారు.

ముక్కు పుడక సమర్పణ



ముక్కు పుడకను ఈఓకు అందిస్తున్న శివశంకర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక 12 పంపుల సెంటర్‌లోని కనకదుర్గమ్మవారికి జిల్లాకు చెందిన మంతెన శివ శంకర్ అనే భక్తుడు బంగారు ముక్కు పుడక సమర్పించారు. 8.610 గ్రాముల పచ్చరాయితో తయారు చేయించిన ముక్కు పుడకను బుధవారం ఆలయంలో కార్యనిర్వహణాధికారి పి.రీనా మాధురికి అందజేశారు. అర్చకులు కందుకూరి రాజా ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి ముక్కు పుడక అలంకరించారు. అనంతరం భక్తుడు శివ శంకర్‌కు అమ్మవారి ప్రసాదాలు అందచేశారు.

నేడు బిషప్ జయరావు పట్టాభిషేక వార్షికోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు పీఠాధిపతి, విశాఖపట్నం అగ్రపీఠ అపోస్తలిక పాలనాధికారి బిషప్ జయరావు పొలిమేర 11వ పీఠాధిపత్య వార్షికోత్సవం గురువారం నిర్వహించనున్నట్టు ఏలూరు అమలోద్భవి మాత విచారణ గురువు ఫాదర్ మైఖేల్ ఇంజమాల తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ఏలూరు విద్యానగర్‌లోని మొనస్టరీలో దివ్య బలిపూజ సమర్పిస్తారని, 9 గంటలకు బిషప్ హౌస్‌లోని పాస్టరల్ సెంటర్‌లో దివ్యవాణి టీవీ చానల్ రికార్డింగ్ స్టూడియోను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 9.30 గంటలకు అమలోద్భవి కేథీడ్రల్ ఆలయ ప్రాంగణంలో నిత్యారాధన మందిరానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. జయరావుకు పలువురు గురువులు ఘన సన్మానిస్తారని పేర్కొన్నారు. హైదరాబాద్ అగ్రపీఠాధిపతి అంతోని కార్డినల్ పూల, ఖమ్మం పీఠాధిపతి సగిలి ప్రకాష్, నల్గొండ పీఠాధిపతి కరణం ధమన్ కుమార్ పాల్గొంటారని తెలిపారు.

ఏలూరు జీజీహెచ్‌లో గందరగోళం

- అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు
- మాయమవుతున్న మోటారు సైకిళ్లు
- పట్టించుకోని అధికారులు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా కేంద్రం సర్వజన ఆసుపత్రిలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఆసుపత్రి ప్రాంగణంలో పార్కింగ్ చేసిన మోటారు సైకిళ్లు చోరీకి గురికావటంతో రోగుల బంధువులు, సహాయకులు గగ్గోలు పెడుతున్నారు. హాస్పిటల్‌లో మోటారు సైకిల్, కార్లు పార్కింగ్ చేయాలంటే భయపడాల్సిన దుస్థితి ఏర్పడింది. కొద్ది నెలల క్రితం కొత్తగా వచ్చిన స్టాఫ్ నర్సు కారు టైర్లు మాయమవడంతో ఆమె దిక్కుతోచని స్థితిలో ఉండిపోయింది. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సైతం పనిచేయకపోవటం విశేషం. ఇక మోటారు సైకిళ్ల చోరీకి అడ్డాగా మారిపోయిందనే ఆరోపణలు ఉన్నాయి. జీజీహెచ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉండడంతో సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించలేకపోతున్నటు సమాచారం.

కెమెరాల పనితీరుపై అనుమానం

జీజీహెచ్‌లో ఏదైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే నిఘా నేత్రాలు పనిచేస్తాయా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఆసుపత్రి ఇన్‌గేట్, అవుట్ గేట్, హాస్పిటల్ లోపల, ప్రాంగణంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ వీటి పనితీరుపై అనుమానాలు ఉన్నాయి. రోజూ మోటారు సైకిళ్లు చోరీకి గురవుతుంటే.. పార్కింగ్ షెడ్లు వద్ద మాత్రమే సీసీ కెమెరాలు లేకపోవటం గమనార్హం. ఆర్ఆర్‌పేట సెయింట్ థెరిస్సా స్కూల్ రోడ్డులో నుంచి జీజీహెచ్‌లోనికి వెళ్లే మార్గంలో, ఫైర్‌స్టేషన్ నుంచి అమీనాపేట వైపు వెళ్లే రోడ్డులో ఎమర్జెన్సీకి వెళ్లే మార్గంలోనూ సీసీ కెమెరాలు ఉన్నాయి. జీజీహెచ్ చుట్టూ సీసీ కెమెరాలు పెట్టినా, వాటిలో చోరీకి పాల్పడుతున్న వారి ఆచూకీ లేకపోవటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



అమీనాపేట వైపు ఎమర్జెన్సీ విభాగానికి వెళ్లే మార్గంలో ఉన్న సీసీ కెమెరా



సెయింట్ థెరిస్సా స్కూల్ వైపు ఆసుపత్రిలోకి వెళ్లే మార్గంలో ఉన్న సీసీ కెమెరా



మోటారు సైకిళ్ల పార్కింగ్‌లోని సీసీ కెమెరా



జీజీహెచ్‌లో ఎమర్జెన్సీకి వెళ్లే మార్గంలో సీసీ కెమెరా

నిర్వహణపై నిర్లక్ష్యం

ఏలూరు జిల్లా కేంద్రం సర్వజన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణ బాధ్యత ఎవరు చేపడుతున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. జీజీహెచ్ ఉన్నతాధికారులు ఉదాసీనంగా ఉండడంతో సిబ్బంది విధులను సక్రమంగా నిర్వర్తించటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. జీజీహెచ్‌లో సుమారు 50 మంది వరకు సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తున్నారు. ఇక కాంట్రాక్టర్‌కు నచ్చిన విధంగా అనధికారికంగా చాలామంది పనిచేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అసలు సర్వజన ఆసుపత్రిలో ఏం జరుగుతుందో తెలియక ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు, సహాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జీజీహెచ్‌లో సెక్యూరిటీపై ఆరా



సెక్యూరిటీ గార్డులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఏలూరు టౌన్ : ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ, వారి వస్తువులకు రక్షణ కల్పించే బాధ్యత ఆసుపత్రి సెక్యూరిటీ విభాగానికి ఉందని డీఎస్పీ ఈ శ్రీనివాసులు అన్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మోటారు సైకిళ్ల అపహరణకు గురవుతున్నాయని అందిన సమాచారంతో ఎస్పీ కె.ప్రతాప శివకిషోర్ సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కె.ప్రభాకర్, ఎస్సైలు సాధిక్, బాషా, ఆసుపత్రి ఆర్ఎంఓ ప్రసాదరెడ్డిలు బుధవారం సాయంత్రం ఆసుపత్రి ఆవరణను పరిశీలించారు. ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలో గుర్తించారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న 29 మంది మహిళా, 23 మంది పురుష సెక్యూరిటీ గార్డులను ఉద్దేశించి డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడారు. ఆసుపత్రికి నిత్యం 2500 నుంచి 3 వేల వరకూ ప్రజలు వస్తూ ఉంటారని వారి వస్తువులకు, వాహనాలకు రక్షణ కల్పించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే వాహనాలను తిరిగి పరిశీలించాలని, తిరిగి వెళ్లేటప్పుడు కూడా పరిశీలించాలని ఆదేశించారు. ఇబ్బందులు ఉంటే ఆసుపత్రిలో ఉన్న ఔటోపోస్టు పోలీసులకు తెలియజేయాలన్నారు. ముఖ్యంగా ఆసుపత్రిలోని తల్లి బిడ్డల విభాగం వద్ద ఉన్న సెక్యూరిటీ గార్డులు అత్యంత భద్రతా చర్యలు తీసుకోవాలని అన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలకు ఆసుపత్రి అధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వాహనాలను సంబంధిత పార్కింగ్ ప్రదేశాల్లోనే పార్క్ చేయించాలని, ఎక్కువ రోజులు పార్కింగ్ చేసే వాహనాలను గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు.

ఆటోనగర్ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అధ్యక్షులు నాగేశ్వరరావు

ఏలూరు రూరల్ : ఏలూరు ఆటోనగర్ సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాడాలని ఏలూరు ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అరుణతార నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఏలూరు గన్‌బజార్ క్రిస్టల్ కల్యాణ మండపంలో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొందరు సభ్యులను ప్రలోబపెట్టి కోర్టులో కేసులు వేయించారని నాగేశ్వరరావు ఆరోపించారు. దీంతో ఆటోనగర్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యమౌతోందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి అసోసియేషన్ సభ్యులతో కమిటీ వేసి పోరాటం చేయాలని సూచించారు. విశాఖపట్టణం ఆటోనగర్ అధ్యక్షుడు పఠాన్ మాట్లాడుతూ నూతనంగా సభ్యులను చేర్చుకోవడం ద్వారా అసోసియేషన్ బలంగా మారుతుందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు మహ్మద్ సులేమాన్, ఉపాధ్యక్షుడు కర్రి ఈశ్వరరావు, సహాయ కార్యదర్శి ముర్రాపు సత్యనారాయణ, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

దళిత సేన మహిళా వర్కింగ్ అధ్యక్షురాలిగా ప్రవల్లిక



ప్రవల్లికకు నియామక పత్రం అందజేస్తున్న రవి ప్రకాష్

ఏలూరు (టూటౌన్): దళితసేన ఏలూరు జిల్లా మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లావేటి ప్రవల్లిక నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆమెకు గన్‌బజార్‌లోని దళిత సేన ఏలూరు నగర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ నియామక ఉత్తర్వులను అందించారు. రవిప్రకాష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధనకు సమర్ధవంతంగా ప్రవల్లిక ఏలూరులో పని చేస్తున్నట్లు చెప్పారు. అంబేద్కర్, జ్యోతిరావుపూలే, బాబూజగ్జీవన్ రామ్, సావిత్రిబాయి పూలే వంటి వారి ఆశయాల సాధనకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో దళిత సేన ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు బేతాళ జయసుధ, పలువురు దళిత సేన మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

అదనపు పొగాకు అమ్మకానికి అనుమతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అదనంగా పండించిన పొగాకు అమ్ముకోవటానికి రైతులకు, అధీకృత వేలం ప్లాట్ ఫారాలపై కొనుగోలు చేయటానికి వ్యాపారులకు అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వ సెక్రటరీ, మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ సునిల్ బర్త్వల్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది రైతుల విజయమని, సునిల్ బర్త్వల్‌కు రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యావసరాల ధరలను నియంత్రించాలి



పత్తేబాద రైతు బజారులో తనిఖీ చేస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు(మెట్రో) : నిత్యావసర సరుకుల ధరలను నియంత్రణలో ఉంచాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక పత్తేబాద రైతు బజారు, ఏలూరు 2వ టౌన్ తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. బహిరంగ మార్కెట్ కంటే బియ్యం, కందిపప్పు, పంచదార వంటి నిత్యావసర సరుకులు రైతు బజారులో తక్కువ ధరలకు అందించాలని ఆదేశించారు. అనంతరం ధాన్యం కొనుగోలు, కస్టమ్ మిల్లింగ్ రైస్ డెలివరీ (సీఎంఆర్) విధానంపై సమీక్షించారు. జిల్లాలో 26 బియ్యం, కందిపప్పు కౌంటర్లను సరసమైన ధరలకు ప్రజలకు ఇప్పటికే అందుబాటులోకి తీసుకొచ్చామని, వీటిని ప్రజలు సద్వినియోగించుకోవాలని డీఎస్ఓ సత్యనారాయణరాజు సూచించారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం నిరంతరంగా పర్యవేక్షిస్తోందని, జిల్లాలో 99 రైస్ మిల్లుల్లో ఇప్పటికే 86 రైస్ మిల్లులు సీఎంఆర్ డెలివరీ ఇచ్చినట్టు ఆయన చెప్పారు. ఇంకా 13 రైస్ మిల్లులు డెలివరీ ఇవ్వాల్సి ఉందని, మిల్లర్లతో మాట్లాడి త్వరితగతిన పూర్తిచేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

గ్రంథాలయ పితామహుడు అయ్యంకి



అయ్యంకి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం ఉదయం ఆంధ్ర రాష్ట్ర గ్రంథాలయ ఉద్యమకారులు, గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకట రమణయ్య 134వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం శేఖర్ బాబు అయ్యంకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 1911లో విజయవాడలో రామ్మోహన గ్రంథాలయ స్థాపనకు అయ్యంకి తోడ్పడ్డారని శేఖర్‌బాబు గుర్తుచేశారు. 1914లో విజయవాడలో ఆంధ్రదేశ గ్రంథ భాండాగార ప్రతినిధులతో గ్రంథాలయ మహాసభలు నిర్వహించారని, భారతదేశంలో తొలిసారిగా గ్రంథాలయ సంఘాన్ని, 1915లో సంఘపక్షాన గ్రంథాలయ సర్వస్వం అనే పత్రికను స్థాపించారని తెలిపారు. 1924లో ఆ సంఘ పక్షాన ఇండియన్ లైబ్రరీ జర్నల్ అనే ఆంగ్ల పత్రికను ప్రారంభించారన్నారు. ఈ సంఘాన్ని స్థాపించిన రోజును నేషనల్ లైబ్రరీ డేగా భారత గ్రంథాలయ సంస్థ గుర్తించి, దేశమంతటా 1968 నుంచి ప్రతి సంవత్సరం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు (నేషనల్ లైబ్రరీ వీక్)గా నిర్వహిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు జిల్లా కేంద్ర గ్రంథాలయం సిబ్బంది, కార్యాలయం సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విద్యార్థుల క్రీడలు



నరసింహ స్పెషల్ మున్సిపల్ స్కూల్‌లో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు



గంగానమ్మ గుడి నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాలలో చెస్, క్యారమ్స్ ఆడుతున్న చిన్నారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శిక్షా సప్తాహ్ కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలల్లో రెండో రోజు బుధవారం క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఏలూరు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ యాజామాన్య పాఠశాలల్లో విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, క్యారమ్స్, పరుగు పందాలు, స్కిప్పింగ్, టెన్నికాయిట్ వంటి వివిధ క్రీడాంశాలలో పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి నింపుతూ అంతర్జాతీయ స్థాయిలో రానిస్తున్న దేశ క్రీడాకారుల జీవిత విజయ గాథలను విద్యార్థులకు తెలియజేస్తూ ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించారు.


చదువుకు ఎగనామం.. పార్కులో కాలక్షేపం

పిల్లల భవిష్యత్ బాగుండాలని తల్లిదండ్రులు కలలు కంటూ స్తోమత లేకపోయినా అప్పో సప్పో చేసి చదివిస్తుంటారు. అయితే కొందరు విద్యార్థులు తల్లిదండ్రుల ఆశలకు భిన్నంగా కళాశాలకు దుమ్మా కొట్టి ఇలా పార్కుల్లో తిరుగుతున్నారు. కొంతమంది అయితే సెల్‌ఫోన్‌తో రీల్స్ తీసుకుంటూ.. ఫేస్‌బుక్‌లలో పోస్టులు పెడుతూ.. మరికొందరు కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తూ తమ భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారు. దీనిపై పోలీసులు స్పందించి పార్కులపై నిఘా పెట్టి విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారి భవిష్యత్‌ను చక్కదిద్దాలని పలువురు కోరుతున్నారు.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు











ఏలూరు జన్మభూమి పార్కులో కాలేజీకి దుమ్మా కొట్టి తిరుగుతున్న విద్యార్థులు

లక్ష్మీ గణపతి సేవలో ఎస్పీ దంపతులు



స్వామివారిని దర్శించుకుంటున్న ఎస్పీ దంపతులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్, జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.ధాత్రిరెడ్డి దంపతులు బుధవారం స్థానిక సత్రంపాడులోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో నిర్వహించిన సంకట హర చతుర్థి పూజల్లో పాల్గొన్నారు. వారు స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. వారికి అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. తొలుత అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు వారికి స్వామి వారి చిత్రపటం బహూకరించి దుశ్శాలువాలతో సత్కరించారు.

వెలమలపేటలో నీటి బోరు పనులు

ఏలూరు రూరల్ : పోణంగి 14 డివిజన్ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్య తీర్చేందుకు అధికారులు కొత్త బోరు ఏర్పాటుచేస్తున్నట్టు ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు కంచన రామకృష్ణ తెలిపారు. బుధవారం గ్రామస్తులతో కలిసి ఆయన బోరు పనులను ప్రారంభించారు. రూ.7 లక్షలతో చేపట్టిన ఈ పనులు పూర్తయితే వెలమపేట వాసులకు నీటి సమస్య తీరుతుందని చెప్పారు.

సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట

ఏలూరు (టూటౌన్): కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. స్థానిక అశోక్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడారు. ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

పదవులకు రాజీనామా

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ ఏలూరు నగర అధ్యక్షుడు, ఇడా మాజీ చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, పార్టీ ఏలూరు జిల్లా కోశాధికారి, ఏలూరు క్లస్టర్-3 అధ్యక్షుడు మంచెం మైబాబు పార్టీ పదవులకు రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్టు వారు తెలిపారు.

షర్మిళకు స్వాగతం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారీ వర్షాలకు పశ్చిమ గోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ముంపుకు గురైన పంట పొలాలు, ఇళ్లను పరిశీలించడానికి వెళుతున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళకు ఏలూరు ఆశ్రం కళాశాల వద్ద డీసీసీ నాయకులు స్వాగతం పలికారు. కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు, నాయకులు మరీదు కృష్ణ, గౌతు సత్యేంద్ర బాబు, పైడా పోతురాజు, బండి భాస్కర రావు, బొద్దు శ్రీనివాస్, తాళ్లూరి చక్రవర్తి తదితరులు ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

యుడైస్‌ను వేగవంతం చేయాలి

దెందులూరు: యూడైస్ నమోదు ప్రక్రియను అన్ని పాఠశాలల్లో వేగవంతం చేయాలని, కలెక్టర్ ఆదేశాలను గడువులోగా పూర్తి చేయాలని దెందులూరు ఎంఈఓలు కేవీఎస్‌వీ ప్రసాద్, కె.అన్నమ్మ సూచించారు. బుధవారం దెందులూరు ఎంఆర్‌సీ సెంటరులో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో అవగాహ న కల్పించారు. ఎంఈఓలు మాట్లాడుతూ శిక్షా సప్తాహ్ ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్న కేంద్ర ప్రభుత్వ ముఖ్య కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల్లో విజయవంతం చే యాలన్నారు. అన్ని పాఠశాలల్లో 100 శాతం విద్యార్థుల హాజరు నమోదు చేయడంతో పా టు బడిబయట ఉన్న చిన్నారులను పాఠశాల లో చేరేలా స్లో లెర్నర్స్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రా ంను ప్రాధాన్యత అంశంగా నిర్వహించాలని అన్నమ్మ అన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	రద్దు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	22
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	28
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	28
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	29
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	46	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	10,12
బెండకాయలు	42	కంద	68
పచ్చిమిర్చి	48	బీట్‌రూట్	36
కాకర కాయలు	48	కీరా దోస	50
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	84
బీరకాయలు (పందిరి)	40	అల్లం	100-160
క్యాబేజీ	36	కొత్తిమీర (కట్ట)	15-20
క్యారెట్	34-54	పాలకూర	12-15
దొండకాయలు	36	చుక్కకూర	12-15
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	40	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	84
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	44